

5

మోనాలిసా.
కుంభమేళా టు బాలీవుడ్


# జర్నలిస్ట్ వార్త

TELTEL/2023/87607

అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక



WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 343 గురువారం 23 జనవరి 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# రూ.45,500 కోట్ల భారీ పెట్టుబడి

## ప్రభుత్వంతో సన్ పెట్రో కెమికల్స్ ఎంవోయూ

### సన్ పెట్రో కెమికల్స్ ప్రాజెక్టులతో 7వేల మందికి ఉద్యోగాలు



హైదరాబాద్,జనవరి23(జర్నలిస్ట్ వార్త): తెలంగాణలో భారీ పెట్టుబడులపై దావోస్‌లో మరో కీలక ఒప్పందం జరిగింది. రూ.45,500 కోట్ల పెట్టుబడులతో సన్ పెట్రో కెమికల్స్ ఎంవోయూ చేసుకుంది. భారీ పంప్డ్ స్టోరేజీ పవర్, సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుపై ఒప్పందం జరిగింది. రాష్ట్రంలోని నాగర్ కర్నూల్, మంచిర్యాల, ములుగు ప్రాంతాల్లో ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. సన్ పెట్రో కెమికల్స్ ప్రాజెక్టులతో 7వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం తెలిపింది. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో మూడో రోజు తెలంగాణకు భారీగా పెట్టుబడులు వచ్చాయి. సన్ పెట్రో కెమికల్స్ సంస్థ తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. తెలంగాణలో రూ.45,000 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు ఆ సంస్థ అంగీకరించింది. ఈ మేరకు దావోస్‌లో తెలంగాణ ప్రభుత్వంతో సన్ పెట్రో కెమికల్ సంస్థ ఎంవోయూ చేసుకుంది. రాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్తు, సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఈ సంస్థ ఏర్పాటు చేయనుంది.

మిగతాది 2లో...



# మహారాష్ట్రలో రైలు ప్రమాదం...

## ప్రయాణికుల మీదకు దూసుకెళ్లిన రైలు...12 మంది మృతి

2లో.

# తెలుగు రాష్ట్రాలకు న్యాయమూర్తులు

తెలంగాణకు నలుగురు..
ఎపికి ఇద్దరు
కేటాయింపు



2లో.

# గ్రామసభల్లో ఆందోళనలు బిఆర్ఎస్ కుట్ర

ప్రజలంతా ఆనందంగా దరఖాస్తు చేస్తున్నారు
పదేళ్ల తరవాత రేషన్ కార్డులపై ప్రజల్లో ఆనందం
మంత్రి సీతక్క వెల్లడి



హైదరాబాద్,జనవరి23(జర్నలిస్ట్ వార్త): గ్రామసభల్లో ఆందోళనలు కేవలం బిఆర్ఎస్ కుట్రలతో జరిగినవేనని మంత్రి సీతక్క అన్నారు. అంతటా ప్రశాంతంగా సాగుతున్నాయని, ప్రజలు దరఖాస్తులు అందచేస్తున్నారని అన్నారు. కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు ప్రారంభ మయ్యాయి. అయితే గ్రామసభల్లో లబ్దిదారులు ఆందోళనకు దిగారంటూ వస్తున్న వార్తలపై మంత్రి సీతక్క స్పందించారు.

మిగతాది 2లో...

# దావోస్‌లో ఒకే వేదికపై ముగ్గురు సిఎంలు




2లో.

# రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే

రేవంత్ అనాలోచిత నిర్ణయాలతోనే అన్నదాతలఆత్మహత్యలు -కేవలం రైతు సంక్షేమం కోసమేఅధ్యయన కమిటీ

ఈ నెల 24 నుంచి నెల రోజులపాటు రాష్ట్రమంతటా కమిటీ పర్యటన

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్ :జనవరి23(జర్నలిస్ట్ వార్త): రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నా రు. రేవంత్ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు, ఇ చ్చిన హామీలు అమలు చేయకపోవడంతోనే అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విమర్శించారు. రైతు ఆత్మహత్యలపై వే సిన తమ కమిటీ వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశ్యం లేదని, కేవలం రైతాంగానికి అండగా నిలబడాలన్న ఆలోచన తప్ప ఇంకేం లేదని స్పష్టం చేశారు. బుధవారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో సమావేశమైన అధ్యయన కమిటీ తొలి సమావేశం జరిగింది. అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ, ఆదిలాబాద్ బ్యాంకులో ఆత్మహత్య చేసుకున్న రైతు విషాద ఘటనే ఈ కమిటీ వేయడానికి కారణం అని పేర్కొన్నారు.



# హైదరాబాద్‌లో కొత్తగా హెచ్‌సీఎల్ టెక్ సెంటర్

3.20 లక్షల విస్తీర్ణంలో క్యాంపస్ ఏర్పాటు
విస్తరణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం




# బిఆర్ఎస్ రైతు ధర్నాకు హైకోర్టు అనుమతి





# తెలంగాణకు తీరప్రాంతం లేని లోటును పూడ్చుతాం...

## మచిలీపట్నం పోర్టుతో అనుసంధానం చేస్తాం: రేవంత్ రెడ్డి

తెలంగాణలో డ్రైపోర్టును నిర్మించి వేర్ హౌస్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్న సీఎం
డ్రైపోర్టును మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం చేస్తామన్న ముఖ్యమంత్రి
హైదరాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి

తెలంగాణకు తీరప్రాంతం లేని లోటును పూడ్చేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం పోర్టుకు ప్రత్యేక రోడ్డు, రైలు మార్గాలతో అనుసంధానం చేయనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణలో డ్రైపోర్టును నిర్మించి వేర్ హౌస్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ డ్రైపోర్టును సమీపంలోని మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం చేస్తామన్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరమ్, సీఐఐ, హీరో మోటో కార్ప్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం పాల్గొన్నారు. మిగతాది 2లో...

జర్నలిస్ట్ వార్త
TELTEL/2023/87607
అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక



# రూ.45,500 కోట్ల భారీ పెట్టుబడి

(మొదటి పేజి తరువాయి)

ఈ ఒప్పందంతో దాదాపు రాష్ట్రంలోని 7,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇప్పటివరకు దావోస్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న భారీ ఒప్పందం ఇదే కావడం గమనార్హం. రాష్ట్రానికి భారీ పెట్టుబడి రావడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, తెలంగాణ అధికారుల బృందం సంతోషం వ్యక్తం చేసింది. దావోస్‌లో జరుగుతోన్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ బృందం వెళ్లిన విషయం తెలిసిందే. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ టీమ్ వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతున్నారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పించే రాయితీల గురించి కంపెనీలకు వివరిస్తున్నారు. ఇప్పటికే యూనీ లివర్, స్కైరూట్, కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ సంస్థ వంటి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. తాజాగా సన్ పెట్రో కమికల్స్ సంస్థ కూడా భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది.

# గ్రామసభల్లో ఆందోళనలు బిఆర్ఎస్ కుట్ర

(మొదటి పేజి తరువాయి)

బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ.. మంగళవారం మొత్తం 3410 గ్రామాల్లో గ్రామసభలు జరిగాయని.. కేవలం 142 గ్రామాల్లోని ఆందోళనలు జరిగాయని స్వయంగా బీఆర్ఎస్ పత్రికలోనే చెప్పారన్నారు. అంటే కేవలం నాలుగు శాతం గ్రామాల్లోనే కొంత గొడవ జరిగింది.. అది కూడా టీఆర్ఎస్ వాళ్ళు ఉద్దేశపూర్వకంగా చేశారని ఆరోపించారు. అంటే 96 శాతం గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో గ్రామసభలు జరిగినట్టు స్పష్టమవుతుందన్నారు. పదేళ్ల తర్వాత గ్రామ సభలు కాబట్టి ప్రజలు సంతోషంగా ఉన్నారని.. గ్రామ సభల్లోనే అర్హులని గుర్తిస్తున్నామని తెలిపారు. గతంలో ఎమ్మెల్యేలు చెప్పిన వాళ్ళకే పథకాలు వచ్చేవని విమర్శించారు. ఫామ్ హౌస్‌లో, ఎమ్మెల్యేలు ఇండ్లలో కూర్చొని లబ్దిదారులను ఎంపిక చేశారని.. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గ్రామ సభల్లోనే ప్రజల సమక్షంలో లబ్దిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా లబ్దిదారులను గుర్తిస్తుంటే కావాలని టీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఓట్లప్పుడే పథకాలు అరకొరగా ఇచ్చేవారన్నారు. కానీ ప్రజా అవసరాలు, ఆర్థిక వనరులను బట్టి పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని.. అందుకే ఉద్దేశపూర్వకంగా బీఆర్ఎస్ గొడవలు చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్ మాటలు నమ్మి కొందరు ఆర్థిక సామాజిక రాజకీయ కుల సమగ్ర ఇంటింటి సర్వేలో పాల్గొనలేదని.. ఇప్పుడు వాళ్ళకి పథకాలు రావనే ఆందోళన ఉందన్నారు. ఏ ఒక్క అర్హుడు నష్టపోకుండా ప్రజాపాలన దరఖాస్తులు తీసుకున్నామని స్పష్టం చేశారు.

# బిఆర్ఎస్ రైతు ధర్నాకు హైకోర్టు అనుమతి

హైదరాబాద్ జనవరి23(జర్నలిస్ట్ వార్త):: నల్లగొండలో బి ఆర్ఎస్ తలపెట్టిన రైతు మహాధర్నాకు హై కోర్టు అనుమతి ఇచ్చింది. నల్లగొండలో ఈనెల 28వ తేదీన క్లాక్ టవర్ సెంటర్‌లో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వర కు బిఆర్ఎస్ రైతు ధర్నా కార్యక్రమానికి హై కోర్టు అనుమతిం చింది. మంగళవారం జరగాల్సిన రైతు మహాధర్నాకు జిల్లా యంత్రాంగం అనుమతి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. బిఆర్ఎస్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు రైతు మహాధర్నాకు షరతులతో కూడిన అనుమతినిచ్చింది. కాంగ్రెస్ సర్కార్ రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలనిడిమాండ్ చేస్తూ ఈ నెల 21న నల్లగొండలో బిఆర్ఎస్ పార్టీ తలపెట్టిన రైతు మహాధర్నాకు పోలీ సులు అనుమతి నిరాకరించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి జిల్లా నాయకులు ఏర్పాట్లు పూర్తి చేసిన్నప్పటికీ, జిల్లాలో గ్రామ సభలు, సంక్రాంతి రద్దీ కారణంగా బందోబస్తు ఇవ్వలేమంటూ జిల్లా పోలీసులు ధర్నాకు అనుమతి నిరాకరించారు. దీంతో బిఆర్ఎస్ రైతు ధర్నా అనుమతి కోసం హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు బిఆర్ఎస్ రైతు మహాధర్నాకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 28వ తేదీన జరిగే బిఆర్ఎస్ రైతు మహాధర్నాకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌తో పాటు మాజీ మంత్రి, ఎంఎల్ఎ జగదీశ్‌రెడ్డి,, పలువురు నాయకులు హాజరు కానున్నారు

# హైదరాబాద్‌లో కొత్తగా హెచ్‌సీఎల్ టెక్ సెంటర్

హైదరాబాద్,జనవరి23(జర్నలిస్ట్ వార్త): ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సీఎల్ హైదరాబాద్ లో కొత్త టెక్ సెంటర్‌ను ప్రారంభించనుంది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు, హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ సివిజయకుమార్‌తో చర్చలు జరిపారు. హెచ్‌సీఎల్ కొత్త సెంటర్‌లో లైఫ్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సేవలకు ప్రాధాన్యమిస్తుంది. అత్యాధునిక క్లౌడ్, అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్‌లను అందిస్తుంది. హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్ ఏర్పాటవుతుంది. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుండి గోల్డ్ సర్టిఫికేషన్ అందుకుంది. దీంతో దాదాపు 5,000 మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు లభిస్తాయి. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు, ఐటీలో ప్రతిభా వంతులైన నిపుణులతో ఇప్పటికే హెచ్‌సీఎల్ గ్లోబల్ నెట్‌వర్క్ సెంటర్ గా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ కొత్త సెంటర్ మరింత అత్యాధునిక సామర్థ్యాన్ని అందుబాటులోకి తెస్తుందని హెచ్‌సీఎల్ టెక్ సీఈవో విజయకుమార్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో హెచ్‌సీఎల్ సేవల విస్తరణను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్వాగతించారు. ప్రపంచంలో ఐటీ హబ్ గా హైదరాబాద్ తన స్థానాన్ని మరోసారి పదిలం చేసుకుందని అభిప్రాయపడ్డారు. వచ్చే నెలలో కొత్త సెంటర్‌ను ప్రారంభించాలని ఆహ్వానించారు. స్థానిక యువతకు ఉద్యోగాలతో పాటు హైదరాబాద్‌లోని టెక్నాలజీ, ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాలకు ఐటీ పరిశ్రమను విస్తరించాలని హెచ్‌సీఎల్ టెక్ ప్రతినిధులను కోరారు. ప్రభుత్వం తరఫున తగిన సహకారం అందిస్తామని చెప్పారు. 2007 నుంచే హెచ్?సీఎల్ హైదరాబాద్ నుంచి ప్రపంచ వ్యాప్తంగా తమ క్లయింట్లకు సేవలను అందిస్తోంది. కొత్త కేంద్రంతో హైదరాబాద్ లో హెచ్‌సీఎల్ మొత్తం అయిదు సెంటర్లను విస్తరించనుంది.

# తెలంగాణకు తీరప్రాంతం లేని లోటును పూడ్చుతాం...

(మొదటి పేజి తరువాయి)

ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రపంచస్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అందరూ సహకరించాలని కోరారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, అత్యంత వేగవంతమైన, పర్యావరణ అనుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలన్నారు. తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు సహకరించాలని కోరారు.ప్రజలు తక్కువ ఖర్చుతో వేగంగా ప్రయాణించాలనేది ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వాహనాలను ప్రోత్సహించేందుకు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీలను రద్దు చేశామన్నారు.

దేశంలో అత్యధిక ఎలక్ట్రానిక్ వాహనాల విక్రయాలు తెలంగాణలోనే జరుగుతున్నట్లు చెప్పారు. పర్యావరణ అనుకూల వాహనాల కోసం జీహెచ్‌ఎంసీలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను తీసుకువస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో కోటికి పైగా జనాభా ఉందని, 100 కిలోమీటర్ల మేర మెట్రో లైన్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు

# మహారాష్ట్రలో రైలు ప్రమాదం...

## ప్రయాణికుల మీదకు దూసుకెళ్లిన రైలు...12 మంది మృతి



జనవరి23(జర్నలిస్ట్ వార్త): మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. జలగావ్ జిల్లాలో పరండా రైల్వే స్టేషన్ సమీపంలో కర్ణాటక ఎక్స్ ప్రెస్ ఢీకొట్టడంతో 12 మంది మృతి చెందారు. పుష్పక్ ఎక్స్ ప్రెస్ ట్రైన్ లో మంటలు చెలరేగాయన్న వదంతులతో ప్రయాణికులు భయాందోళనలకు గురై చైన్ లాగి కిందికి దిగారు. భయంతో పట్టాలు దాటుతున్న ఆ ప్రయాణికులను మరో ట్రాక్ వేగంగా దూసుకొచ్చిన కర్ణాటక ఎక్స్ ప్రెస్ ఢీకొట్టింది. ఈ ఘటనలో 12 మంది మృతి చెందారు. దీనిపై సమాచారం అందుకున్న రైల్వే అధికారులు వెంటనే స్పందించి, ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రమాద తీవ్రతను బట్టి మరణాల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నారు.



# తెలుగు రాష్ట్రాలకు పలువురు న్యాయమూర్తులు

## తెలంగాణకు నలుగురు..ఏపికి ఇద్దరు కేటాయింపు

న్యూఢిల్లీజనవరి23(జర్నలిస్ట్ వార్త): తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు పలువురు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. అందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులను బుధవారం కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. అందులోభాగంగా తెలంగాణ హైకోర్టుకు నలుగురు న్యాయమూర్తులు జస్టిస్ రేణుక ఎర్రా, జస్టిస్ నర్సింగరావు నందికొండ, జస్టిస్ తిరుమల దేవి ఎడ, జస్టిస్ మధుసూధనరావు బొబ్బిలి రామయ్యలను నియమించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులు.. జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ యడవల్లి లక్ష్మణరావులను నియమించింది. తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు పలువురు న్యాయమూర్తులను ఎంపిక చేసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన నాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో ఇటీవల న్యూఢిల్లీలో సమావేశమైంది. అందుకు పలువురు న్యాయమూర్తుల పేర్లను కేంద్రానికి సిఫార్స్ చేసింది. వీరి నియమాకానికి సంబంధించి.. ఈ రోజు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసింది. అయితే హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 28 మంది న్యాయమూర్తులే ఉన్నారు. ప్రస్తుతం కొలీజియం సిఫారసు చేసిన ఇద్దరూ వస్తే ఆ సంఖ్య 30కి చేరుతుంది. మరో ఏడుగురు న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే తెలంగాణ హైకోర్టులో పలు ఖాళీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నలుగురు న్యాయమూర్తుల పేర్లను సిఫార్స్ చేశారు. వీరు న్యాయమూర్తులుగా ప్రమాణం చేయనున్నారు.



---

# రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే

బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ ఆదేశం మేరకు ఏర్పాటైన ఈ కమిటీ శుక్రవారం(జనవరి 24) నుంచి పూర్వ ఆదిలాబాద్ జిల్లా నుంచి పని ప్రారంభిస్తుందన్నారు. రాబోయే నెల రోజులపాటు అన్ని జిల్లాలలో అన్ని వర్గాల రైతులను కలిసి రుణమాఫీ ఎంత మేరకు జరిగింది..? అసలు రాష్ట్రంలో ఏం జరుగుతుంది..?..కరెంటు సరఫరా ఎలా ఉంది..?.. సాగు పరిస్థితి ఎలా ఉంది..? మద్దతు ధర దొరకుతుందా..? బోనస్ ఏమైంది..? కొనుగోలు కేంద్రాలు ఏమయ్యాయి..? రైతు వేదికలు పనిచేస్తున్నాయా..? వంటి అంశాలను అధ్యయనం చేస్తుందని తెలిపారు. రైతాంగం ఎదుర్కుంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు ఆత్మహత్యలకు కారణాలను అధ్యయనం చేసి నివేదికను రూపొందిస్తుందని, ఆ నివేదికను బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తుందని వెల్లడించారు.రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో వరంగల్ వేదికగా రైతులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలను ఇచ్చిందని కెటిఆర్ అన్నారు. 2 లక్షల రుణమాఫీ, 15 వేల రైతు భరోసా, మద్దతు ధర, బోనస్ ఇవ్వడంతో పాటు విస్తారంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ హామీలను నమ్మి రైతులు ఆ పార్టీకి అధికారాన్ని అప్పగించారని పేర్కొన్నారు. అయితే ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ దారుణంగా విఫలమైందని విమర్శించారు. రైతుల పట్ల కెసిఆర్‌కు ఉన్న ప్రేమ, ఆర్తి ప్రస్తుత పాలకుల్లో మచ్చుకైనా కనిపించడం లేదని చెప్పారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదన్న పెద్దల మాటను వందకు వంద శాతం నమ్మి అందుకు తగ్గట్టుగానే 65 శాతం మంది ప్రజలు ప్రత్యక్షంగా ఆధారపడిన వ్యవసాయరంగ సంక్షేమానికి కెసిఆర్ ఎన్నో కార్యక్రమాలను అమలు చేశారని తెలిపారు. రైతుబంధు, రుణమాఫీ పేరుతో లక్ష కోట్ల రూపాయలను నేరుగా 70 లక్షల రైతుల ఖాతాల్లో వేసిన ఏకైక ముఖ్యమంత్రి భారతదేశ చరిత్రలో కెసిఆర్ ఒక్కరే అని పేర్కొన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతుల్లో ఆత్మవిశ్వాసం అపారంగా ఉండేదని తెలిపారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్తు, భూమిశిస్తు రద్దు, నీటి తీరువ రద్దు, చిన్న నీటి వనరులైన చెరువులను కాపాడే మిషన్ కాకతీయ, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టు నిర్మాణాలతో స్వతంత్ర భారత చరిత్రలో ఇప్పటివరకు ఎవరూ చేయని విప్లవాత్మక పనులను రైతుల కోసం కెసిఆర్ చేశారని చెప్పారు. రైతు ఆత్మహత్యలను గణనీయంగా తగ్గించిన రాష్ట్రంగా తెలంగాణను కేంద్ర ప్రభుత్వమే పార్లమెంటులో ప్రశంసించిందని గుర్తు చేశారు.ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర సమాధానం లేదుఒకే అబద్ధాన్ని వందసార్లు చెప్తే నిజమవుతుందన్న అపోహలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని కెటిఆర్ విమర్శించారు. తమ హయాంలో 6 లక్షల 47 వేల పైచిలుకు రేషన్ కార్డులను మీ- సేవా కార్యాలయాల్లో ఇచ్చామన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న పబ్లిసిటీ పిచ్చి తమకు లేదని అన్నారు. రుణమాఫీ, రైతుబంధు గురించి గ్రామసభల్లో ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర సమాధానం లేదని పేర్కొన్నారు. ప్రజలంతా స్వచ్ఛందంగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాని, ఆ ఆందోళల్లో ఎక్కడా తమ పార్టీ నేతలు లేరని వెల్లడించారు. హోంమంత్రి లేకపోవడంతో రాష్ట్రంలో శాంతిభద్రతలు పడకేశాయని విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ప్రతిపక్షాల మీద అక్రమ కేసులు బనాయించడం, సోషల్ మీడియా పోస్టులకు భయపడి అరెస్టుల చేసే తాపత్రయం సిఎం రేవంత్‌ది అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రాధాన్యం ఫార్ములా కేసు అయితే, తమ ప్రాధాన్యత ఫార్మర్ అని స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పుకు అనుగుణంగా త్వరలోనే నల్లగొండలో రైతు ధర్నా నిర్వహిస్తామని కెటిఆర్ వెల్లడించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి

## -సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి

**ధర్మసాగర్/జనవరి23(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో సిపిఐ ధర్మసాగర్ గ్రామ శాఖ నూతన కమిటీ ఎన్నిక బుధవారం కర్ర రాజిరెడ్డి అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బిక్షపతి విచ్చేసి మాట్లాడుతూ. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు రైతుబంధు నిజమైన లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రభుత్వ అధికారులు ఇల్లు వచ్చిన వారికి మళ్ళీ ఇండ్లు లిస్టులో పేర్లు వచ్చాయని ప్రతి గ్రామంలో విమర్శలు ఉన్నందున వెంటనే రీ సర్వే చేసి నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వ అధికారులు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత స్వతంత్రాన్ని గుర్తించం అయోధ్య రామాలయాన్ని నిర్మించిన నుండే ఈ దేశానికి స్వాతంత్రం వచ్చిందని ఆర్ఎస్ఎస్ నేత మోహన్ భగవత్ చెప్పడం భారత ప్రజలను అవమాన పరచడంలో ఒక భాగం అని అన్నారు

భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ అంబేద్కర్ గారిని అవమానకరంగా భారత హోం మంత్రి అమిత్ షా ఈ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడడం బాధాకరం



రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామసభల ద్వారా కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ గృహాలు.. పింఛన్లు.. ధరణి తదితర అంశాల పైన అరులైన వారిని గుర్తించి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తామని పేర్కొనడం అర్హులైన వారు ఇళ్ల స్థలాలు పక్క ఇల్లు లేక గ్రామాలలో బడుగు బలహీన వర్గాలు దళితులు కడు పేదరికంలో జీవిస్తున్నారు దరఖాస్తు చేసుకున్నవారు అందరికీ అందించే విధంగా చూడాలని రేషన్ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి అందించాలని పింఛన్లు 57 సంవత్సరాల వయస్సున్న వారికి అందించాలి.ధరణిలో భూమి సమస్య అనేక విధాలుగా లోపాలతో గ్రామాల్లో తీవ్రతరం అవుతుంది ఈ సమస్య పరిష్కారం కోసం యుద్ధ ప్రాతిపదికన సమస్య పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ధర్మసాగర్ గ్రామ శాఖ కార్యదర్శి ధర్మసాగర్ గ్రామ శాఖ కార్యదర్శి చిలుక బాబు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ జిల్లా కార్యక సభ్యులు మునగాల బిక్షపతి నాయకులు మాలో తూ శంకర్ నాయక్ బట్టు మల్లయ్య కొట్టే వెంకటేష్ కొట్టే ప్రభాకర్ రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయి

**- మండల ప్రజలు ఆందోళన చెందవద్దు - వర్ధన్నపేట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ**



వర్ధన్నపేట/జనవరి 22(జర్నలిస్ట్ వార్త):
ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రతి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు వర్తిస్తాయని వర్ధన్నపేట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశానుసారం క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 26 నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాల లబ్ది జరుగుతుందని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో గ్రామసభలు జరుగుతున్న క్రమంలో ఎంపిక కానివారిని గ్రామ సభల్లోనే ఎంపిక చేయనున్నారని తెలిపారు. అర్హులైన వారు ఎంపిక కాకపోతే గ్రామ సభల్లో అప్లికేషన్లు పెట్టుకోవాలని చెప్పారు. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని, వారు గత పది సంవత్సరాల్లో ఒక రేషన్ కార్డ్ అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. రైతు భరోసా పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న 10 వేల రూపాయలను 12 వేలకు పెంచడం జరుగుతుంది. దేశంలోని మొదటి సారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు 12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పకుండా ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తుందని మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు,500 కి గ్యాస్, ఆరోగ్యశ్రీ 5 నుంచి10 లక్షలకు పెంచుకున్నామని అన్నారు. రైతులకు రెండు లక్షల లోపు రుణమాఫీ చేశామని, ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఆయన అన్నారు. సన్న వడ్లకు 500 బోనస్ ఇచ్చామని అన్నారు గతంలో ఎప్పుడూ లేనివిధంగా ధాన్యం సేకరణ చేసిన 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామని అన్నారు. ఈ నెలలోనే మరో 4 పథకాలు ప్రారంభం కానున్నాయి, అందువల్ల ప్రజలు ఎవరు అధైర్య పడవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు వర్తిస్తాయని తెలిపారు. గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతుండడంతో ఎవరికైనా అర్హత ఉండి రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళు లబ్ధిదారులుగా ఎంపిక కాకపోతే గ్రామసభ అధికారులకు తమతమ పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రేషన్ కార్డుల, ఇందిరమ్మ ఇళ్లపై జరుగుతున్న తప్పుడు సమాచారంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి, వారికి అండగా నిలబడాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు పోశాల వెంకన్న గౌడ్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కుల్ల యాకాంతం పాల్గొన్నారు.

# అదాలత్ సమీపంలో దారుణం

**- కత్తితో దాడికి పాల్పడిన ఆటో డ్రైవర్**
**- ప్రాణాలు కోల్పోయిన మరో ఆటో డ్రైవర్ రాజ్ కుమార్**



**వరంగల్ క్రైం/జనవరి 22(జర్నలిస్ట్ వార్త):** వివాహేతర సంబంధం ఓ వ్యక్తి ప్రాణం బలి తీసుకున్న ఘటన బుధవారం హనుమకొండ జిల్లా సుబేదారి ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానిక సమాచారం మాచర్ల రాజ్ కుమార్ అనే వ్యక్తి ఆటోకి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఆటోను అడ్డుపెట్టి అందరూ చూస్తుండగానే కత్తితో దాడి చేయడం ఆ పరిసర ప్రాంతంలో ప్రజల్ని కలిచివేసింది. ఈ ఘటనలో రాజ్ కుమార్ అనే ఆటో డ్రైవర్ పై వెంకటేశ్వర్లు కత్తితో దాడి చేయగా గాయపడిన రాజ్ కుమార్ రక్తపు మడుగులో కొంత సమయం పాటు కొట్టుమిట్టడారు. జరిగిన ఘటనలో కూరగాయలు అమ్ముకునే ఓ వ్యక్తి మధ్యలో దూరి అడ్డగించేందుకు ప్రయత్నించారు. ఐనప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అప్పటికే గాయపడిన వ్యక్తి కొన ఊపిరితో ఉన్నాడు. ఈ క్రమంలో సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 ద్వారా ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గం మధ్యలోనే ఆ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి చోటుచేసుకుంది. దాడికి పాల్పడిన వ్యక్తిని విచారించగా దాడికి పాల్పడడానికి రాజ్ కుమార్ భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఈ దారుణానికి పాల్పడ్డట్లు చెప్పారని సమాచారం. ఇట్టి విషయమై స్థానిక పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సమాచారం.

# యువ తేజం జాతీయ ప్రతిభా పురస్కారం పొందిన అంబేద్కర్



రాయపర్తి/ జనవరి 22(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం బురహాన్ పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇల్లందుల అంబేద్కర్ తెలుగు సంస్కృతి, తెలుగు వైభవం,సాహిత్యం కళల పరిరక్షణ రంగంలో చేస్తున్న కృషిని గుర్తిస్తూ వరల్డ్ రైటర్స్ ఫోరమ్,వరల్డ్ పోయెట్రీ అకాడమీ టీఎన్ఏ రికార్డ్స్ వారు మహిళ ఎటు వైపు,కాలుష్యమే కారుణ్య మరణాలు,అమ్మ నాన్నలది వృథా శ్రమేనా,ఏది అసలైన బాల్యం మొదలైన మరెన్నో సామాజిక స్పృహ కలిగిన కవితలను పాటలను గుర్తించి కవి,పాటల రచయిత ఇల్లందుల అంబేద్కర్ యువ తేజం జాతీయ యువ ప్రతిభా పురస్కారాన్ని ఈ నెల 21న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర%శీ% విజయవాడ పట్టణంలోని శ్రీ కౌత పూర్ణనంద్ విలాస్ కళా వేదిక యందు జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు ప్రధానం చేసారు.ఈ సందర్భంగా శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కె.ప్రతాప్ అభినందిస్తు ఇలాగే మరెన్నో సామాజిక ఇతి వృత్తాంతం కలిగిన సాహిత్యం సమాజానికి అందించాలని సూచించడం జరిగింది.ఈ సందర్బంగ పలువురు కవులు,రచయితలు,అధికారులు అభినందించారు

# ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

**-పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**





రాయపర్తి/జనవరి 22(జర్నలిస్ట్ వార్త): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.బుధవారం మండలంలోని కొలన్ పల్లి గ్రామంలోనీ గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డ్ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ రైతు భరోసా పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామని అన్నారు. ప్రజాపాలన అనేది నిరంతర ప్రక్రియని ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి, తహసిల్దార్ ఎం శ్రీనివాస్, ఎంపీడీవో జి కిషన్, గ్రామ స్పెషల్ ఆఫీసర్ మల్సూర్ నాయక్, ఏవో వీరభద్రం, ఏపీఓ కుమార్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, పాలకుర్తి సోమేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, గజ్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్ష పార్టీ నాయకుల మాటల ఉచ్చులో పడొద్దు

**-ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే ఇందిరమ్మ సంక్షేమ రాజ్య లక్ష్యం**
**-బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ఇంచార్జ్ ఆడే గజేందర్**










బోథ్ /జనవరి22(జర్నలిస్ట్ వార్త):
ప్రతిపక్ష పార్టీ నాయకుల మాటల ఉచ్చులో పడొద్దని,ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే ఇందిరమ్మ సంక్షేమ రాజ్య లక్ష్యం కాంగ్రెస్ సర్కార్ పనిచేస్తుందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు బుధవారం బోథ్ నియోజకవర్గం లోని ఇచ్చోడ మండల కేంద్రాలలో జరిగిన గ్రామ సభలలో పాల్గొన్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ఇంచార్జ్ ఆడే.గజేందర్ గ్రామ సభలలో లబ్ధిదారుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, బిఆర్ఎస్ పది సంవత్సరాలలో జరుగని అభివృద్ధి తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ సంక్షేమ ప్రజా పాలనలో వచ్చిన పది నెలల్లో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతీ అర్హులైన కుటుంబాలకు ప్రతీ ఇంటికి ఇచ్చే బాధ్యత తామే తీసుకుంటున్నాం అని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ఇంచార్జ్ ఆడే.గజేందర్ కార్యకర్తలను ప్రజలకు హామీ ఇచ్చారు.గత పది సంవత్సరాల పాలనలో ఏ ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వకుండా పంధొమ్మిది లక్షల రేషన్ కార్డులను తొలగించిన మూర్ఖులు నాటి పాలకులు అని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తరవాత అందరికి రేషన్ కార్డులు ఇవ్వడానికి ముందుకు వచ్చాం అని ప్రజలకు భరోసా కల్పించారు. ఈ సందర్బంగా ఆయన వెంట ఇచ్చోడ ,బోథ్ మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు ఉన్నారు.

# స్వయం పరిపాలన దినోత్సవం

**- ఉపాధ్యాయుల పాత్రలో విద్యార్థులు**
**- బహుమతులు బహుకరించిన ప్రధానోపాధ్యాయులు**




వర్ధన్నపేట/జనవరి 22(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. బుధవారం పాఠశాలలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా డీఈఓగా కే.అభినయశ్రీ, ఎంఈఓగా టి. శక్తిశ్వర్, హెచ్ఎంగా సాత్విక్ సమర్ధవంతంగా తమతమ బాధ్యతలను నిర్వర్తించారు. ఈ సందర్భంగా తమతోటి విద్యార్థులతో సబ్జెక్టుల వారిగా పాత్రలు పోషించే విధంగా విధి నిర్వహణలో లోపాలు లేకుండా జాగ్రత్త పడ్డారు. 9,10 వ, తరగతికి చెందిన విద్యార్థినీ విద్యార్థులు తమకు కేటాయించిన సబ్జెక్టుల వారీగా బోధించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ అధ్యక్షతన చేపట్టిన ఉపాధ్యాయ పాత్రలు పోషించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సర్వన్, కిషోర్ కుమార్, కృష్ణ, సుజాత, మాధవి, మమత, ఉమిదేవి, భవాణి, శ్రీనివాస్, రాజు, అంజయ్య, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# ఆత్మీయ భరోసా పథకానికి కీలకంగా మారిన జాతీయ ఉపాధి హామీ జాబ్ కార్డు



కల్లూరు/జనవరి22( జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన అభివృద్ధి పథకాలలో మరో నాలుగు పథకాలు గ్రామ సభల ద్వారా ఎంపిక ప్రక్రియ రాష్ట్రంలో అన్ని గ్రామాలలో మొదలైనది. ఈ పథకాల కొరకు రాష్ట్రంలో అన్ని జిల్లాల నుండి అన్ని మండలాల లో ఉన్న గ్రామాలలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గ్రామసభల ద్వారా స్పెషల్ అధికారి మరియు పంచాయతీ కార్యదర్శి మరియు మండల అధికారుల చేత గ్రామసభ నిర్వహించడం జరుగుతుంది.

**ఈ నాలుగు పథకాలలో పెద్ద సమస్య గా మారిన పథకం ఆత్మీయ భరోసా పథకం..**

సెంటు భూమి లేని వారిని ఆత్మీయ భరోసా పథకానికి లబ్ధిదారులగా గుర్తించాలి ఈ పథకం ద్వారా 12000 వేల రూపాయిలు ప్రభుత్వం లబ్ధిదారుని బ్యాంకు అకౌంట్ నందు జమ చెయ్యడం జరుగుతుంది. కాని భూమి లేని వారి ఆశలపైన నీరు చల్లే విధంగా మారిన ఈ ఉపాధి హామీ పథకం ఎందుకంటే గ్రామాల్లో ఉపాధి హామీ పనేగా అని పట్టించుకోకుండా సింపుల్ తీసివేసిన ఉపాధి హామీ జాబ్ కార్డు ఆత్మయ భరోసా పథకానికి ఆయువు పట్టు గా మారడం వల్ల గ్రామ ప్రజలు ఆశ్చర్యం మొదలైంది . లబ్ధిదారులుగా గుర్తించడానికి ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి వున్నవారినే అర్హులుగా గుర్తిచాలని షరతులు వల్ల లబ్ధిదారులు బాధపడుతున్నారు. అర్హత కలిగి ఉండి ఉపాధి హామీ పనికి వెళ్లకపోవడం వల్ల ఆత్మీయ భరోసా పథకానికి అనర్హులుగా గుర్తించటం శోచనీయం.

ఉపాధి హామీ పనేగా అని తేలికగా తీసుకుంటే ఆ ఉపాధి హామీ పని తెలంగాణ రాష్ట్రంలో భూమిలేని నిరుపేదలకు శాపంగా మారింది. జాబు కార్డు లేని వారుని ఆత్మీయ భరోసా పథకం అనర్హులుగా గుర్తించి ప్రభుత్వం.కాబట్టి ఇప్పటికైనా ప్రజలు మేల్కొని ఉపాధి హామీ పని దినాల జాబ్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకుని జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డ్ పొంది ప్రభుత్వం పథకాలు కు అర్హులు కావాలని ప్రజలు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ ఆఫీస్ ల చుట్టూ ప్రదక్షణలు మొదలెట్టారు .

# సంక్షేమ పథకాల అమలులో అపోహలకు తావివ్వద్దు

**- అర్హులైన రబ్ధిదారులను ఎంపిక చేయాలి - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**





వరంగల్ బ్యూరో/జనవరి 22(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండలం కడారి గూడెం, పర్వతగిరి మండలం గోపనపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలలో బుధవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, అదన కలెక్టర్ జి సంధ్యారాణి పాల్గొన్నారు. వారి వెంట ఇందిరమ్మ ఇండ్ల నోడల్ అధికారి జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, సంబంధిత మండలాల తహశీల్దార్లు విజయ సాగర్, వెంకటస్వామి ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై ఏర్పాటు చేసిన తీర్మానాన్ని గ్రామ ప్రజల సమక్షంలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నాలుగు సంక్షేమ పథకాలు అమలు తీరులో ఎలాంటి అపోహలకు తావివ్వకుండా అర్హులైన రబ్ధిదారులకు న్యాయం జరిగేలా ఈ గ్రామసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ గ్రామ సభలో నమోదు కానీ పేర్లు ఏవైతే ఉన్నట్లయితే వాటిని మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. ఈ గ్రామ సభలో ఈ నాలుగు సంక్షేమ పథకాలే కాకుండా గ్రామానికి కావలసిన ఏర్పాట్లు, ప్రజల సమస్యలు ఏదైనా ఉన్నట్లయితే వాటిని ఈ గ్రామసభ ద్వారా మరొక రిజిస్టర్ ఏర్పాటు చేసి, అందులో వారి దరఖాస్తులు నమోదు చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేందుకు ఈ గ్రామ సభల ద్వారా గ్రామస్తుల సమక్షంలో ఏర్పాటు చేయడమైనదని ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు

### పర్వతగిరి మండలం..

పర్వతగిరి మండలం గోపనపల్లి గ్రామసభలో ప్రజల అవసరాల నిమిత్తం వ్యవసాయానికి కరెంటు ఇబ్బందిగా ఉన్నందున సబ్ స్టేషన్ కావలసిందిగా గ్రామస్తుల విన్నవించుకున్నారు. వారి విన్నపం మేరకు జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఎలక్ట్రిసిటీ అధికారులకు ఫోన్ చేసి కరెంటు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం గోపనపల్లిలోని దూడల మల్లికార్జున స్వామి దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కల్పన, మండల స్పెషల్ ఆఫీసర్స్, సంబంధిత అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పంచాయతీ సెక్రెటరీ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నిజమైన అర్హులను ఎంపిక చేసేందుకే గ్రామ సభలు

**-ఆర్డి వో రాజేందర్ గౌడ్**



కల్లూరు/జనవరి22(జర్నలిస్ట్ వార్త):
నిజమైన అర్హులను ఎంపిక చేసేందుకే మళ్ళీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహిస్తున్నామని ఆర్ డి వో రాజేందర్ గౌడ్ అన్నారు. బుధవారం కల్లూరు మండలం కోర్ల గూడెం గ్రామం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డి వో రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ గతంలో జరిగిన గ్రామ సభల్లో దరఖాస్తు ఇచ్చి ప్రస్తుతం ఈ నెల 26 నుంచి అమలు కాబోతున్న నాలుగు పథకాల జాబితాలో పేర్లు రాకపోతే ఎవరూ కూడా అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. వారి కోసమే మళ్లీ ఈ గ్రామ సభలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నాలుగు రోజులు పాటు విడతల వారీగా ఆయా గ్రామాల్లో జరిగే గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకునే వారిలో నిజమైన అర్హులు ఉంటే వారికి వెంటనే పథకాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో కల్లూరు మండల ఎంపీడీఓ చంద్రశేఖర్, కల్లూరు ఎస్సై డి హరిత, కోర్లగూడెం స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్ రావు, పంచాయితీ కార్యదర్శి రామ్ ప్రసాద్ , ఏ ఈ వో నవ్య. కాంగ్రెస్ నాయకులు మట్టా రామకృష్ణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లా పై కేంద్ర ప్రభుత్వం చిన్న చూపు

**-నిధులు రాబట్టడంలో బిజెపిస్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు విఫలం**
**-కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి**



బోథ్/ జనవరి22(జర్నలిస్ట్ వార్త): ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంతో పాటు, నలుగురు ఎమ్మెల్యేలను ఈ పార్లమెంట్ ప్రజలు బిజెపి పార్టీకి అందించిన కేంద్ర ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా పై చిన్న చూపు చూస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. బోథ్ మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు, పార్లమెంట్లో బిజెపి శాసనసభా పక్ష నేత, ఉపనేత, ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న వెనుకబడిన జిల్లాలకు రావలసిన నిధులు తేవడంలో, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయనున్న ఆర్మూర్ ఆదిలాబాద్ రైల్వే లైన్ కి నిధుల మంజూరు విషయంలో, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు న్యాయంగా రావలసిన గిరిజన యూనివర్సిటీ విషయంలో, నూతనంగా ఏర్పాటు చేయనున్న నవోదయ పాఠశాలలు, సైనిక్ పాఠశాలల ఏర్పాటులో ఈ ప్రాంత బిజెపి ప్రజా ప్రతినిధులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని, నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం వల్లే న్యాయంగా రావలసిన వాటికి నిధులు రాకుండా ఉన్నాయని వీటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో, బడ్జెట్ సమావేశాల్లో ఆదిలాబాద్ జిల్లాకి రావలసిన అన్ని రకాల నిధుల మంజూరుకు కృషి చేయాలని, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకానికి అడ్డుగా ఉన్న అన్ని అటవీ అనుమతులు తేవడానికి కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ తరపున కావలసిన అన్ని రకాల అనుమతులు ఇప్పించడానికి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకత్వం సిద్ధంగా ఉందని, అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్ష రాజకీయ పార్టీలను రైల్వే మంత్రి, అటవీ పర్యావరణ, ఆర్థిక శాఖల మంత్రులను ప్రత్యక్షంగా కల్పించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోద్దు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహేష్ గడ్డల నారాయణ,తదితరులు పాల్గొన్నారు

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కి బుద్ధి చెప్పాలి

**-బిజెపి రాష్ట్ర నాయకులు కర్ర శ్రీనివాస్ రెడ్డి**



రాయపర్తి/ జనవరి 22(జర్నలిస్ట్ వార్త): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కి బుద్ధి చెప్పాలని బిజెపి రాష్ట్ర నాయకులు కర్ర శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నూనె అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్ని స్థానాలకు పోటీ చేస్తామని విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా పాలన పేరుతో ప్రజలను ఆగం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా ఉపాధ్యక్షులు దొంగరి మహేందర్, మహబూబాద్ జిల్లా ఉపాధ్యక్షులు రంగురామ్ గౌడ్ ,అసెంబ్లీ కో కన్వీనర్ కోటేశ్వరరావు ,మండల ప్రధాన కార్యదర్శి బూరుగు నవీన్ గౌడ్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాపాక ప్రశాంత్, జిల్లా అధికార ప్రతినిధి పెండ్యాల గణేష్ ,మండల అధ్యక్షులు సుమన్,సురేష్, జక్కుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ సభను జయప్రదం చేయండి

**-ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ**







బోథ్/జనవరి22(జర్నలిస్ట్ వార్త):
బహిరంగ సభను
జయప్రదం చేయ్యాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ అన్నారు. బుధవారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ నేడు అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి, ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రారంభమై, నేతాజీ చౌక్, వినాయక్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, కలెక్టర్ చౌక్, బాబు జగ్జీవన్ రావ్ చౌరస్తా మీదుగా ఎస్ టీ యూ లో భవన్ మీటింగ్ ఉంటుందన్నారు. ఈ ర్యాలీలో మాదిగ జాతి ముద్దుబిడ్డ మందకృష్ణ మాదిగ పాల్గొననున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు మాదిగ మాదిగ ఉపకులాల ప్రజలు, వర్గీకరణకు సంఘీభావంగా నిలుస్తున్న ప్రజాస్వామికవాదులు, మాదిగ వాడల్లో ఇళ్లకు తాళాలు వేసి, సంకల దప్పు వేసుకొని అదిలాబాదు గడ్డమీద మాదిగ ఉపకులాల ఐక్యత శక్తిని చాటి, వర్గీకరణ వ్యతిరేక స్వార్ధపరుల గుండెలు అదిరేలా ప్రతి ఒక్కరు దప్పు , నల్ల ,కండువా జెండాలతో సమయపాలన పాటిస్తూ వేలాదిగా తరలివచ్చి అధినేత మంద కృష్ణ కు ఘన స్వాగతం పలుకుతూ ర్యాలీని సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అదిలాబాద్ జిల్లా కమిటీ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గైక్వాడ్ సూర్యకాంత్ మాదిగ, సీనియర్ నాయకులు సందూరి వినయ్ సాగర్ మాదిగ, గణేష్ మాదిగ టౌన్ నాయకులు ఆరేపల్లి రాజేష్ మాదిగ, రోడ్డ గంగన్న మాదిగ శ్రీనివాస్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# యువతిని మోసం చేసిన కేసులో ఒకరి రిమాండ్

**-నలుగురి పై కేసు నమోదు**

బోథ్/జనవరి22(జర్నలిస్ట్ వార్త): యువతికి పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పి కొన్నేళ్లుగా పెళ్లి చేసుకోకుండా మోసం చేసిన నిందితుడిని రిమాండ్ తరలించినట్లు బుధవారం ఎస్సై ఎల్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బోథ్ మండల కేంద్రానికి చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన కేసులో ఇదే గ్రామానికి చెందిన మల్లెపూల వంశీ కుమార్ అనే వ్యక్తిని 14 రోజుల రిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు. బాధిత యువతి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మల్లెపూల సత్యనారాయణ, మల్లెపూల భూలక్ష్మి, మల్లెపూల లింగారెడ్డి, మల్లెపూల రాములు పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

# మాదకద్రవ్యాల నియంత్రణ పై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్/జనవరి 22(జర్నలిస్ట్ వార్త): నెహ్రూ యువ కేంద్ర, వరంగల్, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 25 కాకతీయ యూనివర్సిటీలో మత్తు, మాదకద్రవ్యాల నియంత్రణపై 25 మంది యువతకు ఏర్పాటు చేయబోయే రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే వారి వయసు 18 నుండి 29 సంవత్సరాలు లోపు ఉండాలని అన్నారు. ఎంపికైన అభ్యర్థులకు భోజనం వసతి, రవాణా భత్యం ఇవ్వబడుతుందని చెప్పారు. ఈనెల 25, 26వ, తేదీలలో జరిగే ఈ శిక్షణ యువతకు చక్కటి అవకాశమని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తిగల యువత హనుమకొండ న్యూ బస్టాండ్ సమీపంలోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో రేపు 24 -01-2025 మధ్యాహ్నం 2 గంటల వరకు సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 08702958776 ఫోన్ నంబర్ లో లేదా ఎన్ వై కే ఆఫీస్ బాలసముద్రం హనుమకొండ వద్ద సంప్రదించాలని కోరారు.

# జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలి

**- వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి**



వరంగల్/జనవరి 22(జర్నలిస్ట్ వార్త):
జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఈనెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణ, వివిధ కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో జాతీయ ఓటర్ల దినోత్సవం సంబంధించిన వివిధ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. స్కూల్స్, కాలేజీలలో ఓటరు ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, మొదటి, రెండవ బహుమతి సర్టిఫికెట్ ప్రదానం చేయుటకు దిశ నిర్దేశం చేయాలని విద్యాశాఖ అధికారి, ఉన్నత విద్యాధికారులను ఆదేశించారు. సీనియర్ సిటిజన్స్ గుర్తించి వారిని నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా సన్మానించుటకు ఏర్పాటు చేయవలసినదిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటు ప్రాముఖ్యతను పెంచే లా అవేర్నెస్ లో భాగంగా ఫ్లాష్ మబ్, మానవహారంతో పాటు ర్యాలీ నిర్వహించుట, సాంస్కృతిక కళా జత బృందాలచే ఓటర్ అవేర్నెస్ పాటలను పాడుతూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు వరంగల్ సత్యపాల్ రెడ్డి, ఉమా రాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, డి ఆర్ డి ఓ కౌసల్యాదేవి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దావోస్‌లో ఒకే వేదికపై ముగ్గురు సిఎంలు


జనవరి23(జర్నలిస్ట్ వార్త):
దావోస్‌లో జరిగిన కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్ సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ పాల్గొన్నారు. దేశం ఒక యూనిట్‌గా పెట్టుబడులు రాబట్టేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 3 రాష్ట్రాల ముఖ్యమంత్రులు.. కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్ సమావేశంలో పాల్గొన్నారు. గ్రీన్ ఎనర్జీ, ఏఐ, రక్షణ రంగంలో పెట్టుబడులకు సంబంధించిన అంశాలు సమావేశంలో చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ లో మూడో రోజు పర్యటిస్తున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో బుధవారం వివిధ రంగాల పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. అలాగే యునీలీవర్, డీపీ వరల్డ్ గ్రూపు, పెట్రోలియం నేషనల్ బెర్హాద్ (పెట్రోనాస్), గూగుల్ క్లౌడ్, పెప్సీకో, ఆస్ట్రా జెనెకా సంస్థల అధిపతులు, బిల్ గేట్స్, వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రతినిధితోనూ సీఎం చంద్రబాబు చర్చలు జరపనున్నారు. తర్వాత దావోస్ సమావేశాల్లో గ్రీన్‌కోతో ఎంవోయూ కుదుర్చుకోనున్నారు. ప్రకృతి వ్యవసాయం, హ్యూమన్ మిషన్ కొలాబ్రేషన్, గ్రీన్ హైడ్రోజన్ ? పునరుత్పాదక విద్యుత్ వంటి అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశాలకు చంద్రబాబు హాజరవుతారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులకు వున్న అవకాశాలను వారికి ముఖ్యమంత్రి వివరించనున్నారు.

# వీరధీరసూరన్‌లో విక్రమ్ బిజీబిజీ




కోలీవుడ్ స్టార్ యాక్టర్ చియాన్ విక్రమ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ఈ స్టార్ హీరో నటిస్తున్న చిత్రాల్లో ఒకటి వీరధీరసూరన్. ఛియాన్ 62 ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న ఈ మూవీకి చిత్త (చిన్నా) ఫేం ఎస్‌యూ అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం 6 గంటలకు ఎక్జయిటింగ్ అప్‌డేట్ అందించబోతున్నారంటూ యాక్టర్ కమ్ ప్రొడ్యూసర్ రియా ఓ సెల్ఫీ వీడియో షేర్ చేసింది. అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విడుదల తేదీయే అయి ఉంటుందని అంతా చర్చించుకుంటుండగా.. దీనిపై మరికొన్ని గంటల్లోనే క్లారిటీ రానుంది. క్యూట్ క్యూట్‌గా సాగుతున్న రియా సెల్ఫీ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే లాంచ్ చేసిన వీరధీరసూరన్ టైటిల్ టీజర్ పక్కా యాక్షన్ ప్యాక్‌డ్ కమర్షియల్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు తెలియజేస్తుంది. ఈ చిత్రాన్ని ఏపీలో శ్రీలక్ష్మి మూవీస్, తెలంగాణలో ఎన్‌వీఆర్ బ్యానర్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మూవీలో కోలీవుడ్ భామ దుషారా విజయన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఎస్‌జే సూర్య, పాపులర్ మలయాళ నటుడు సూరజ్ వెంజరమూడు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# ఓటీటీ వల్లనే సినిమాలు
## ఫ్లాప్ అవుతున్నాయి : అక్షయ్‌కుమార్



బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ఓటీటీలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. థియేటర్‌లో వచ్చే సినిమాలు ఓటీటీ (ఓవర్ ది టాప్)ల వలనే ఫ్లాప్ అవుతున్నాయని తెలిపాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'స్కై ఫోర్స్'. ఈ సినిమాతో వీర్ పహరియా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తుండగా.. సందీప్ కెవ్లానీ, అభిషేక్ కపూర్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. ఈ సినిమాను రిపబ్లిక్ డే కానుకగా జనవరి 24న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. భారత దేశ మొదటి వైమానిక దాడి ఆధారంగా ఈ సినిమా రూపొందగా.. ఇందులో సారా అలీ ఖాన్, నిమ్రత్ కౌర్ కీలక పాత్రలు పోషించారు. జియో స్టూడియోస్, మడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌లపై దినేశ్ విజన్ ఈ సినిమాను నిర్మించాడు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. ఇండియన్ సినిమా ప్రస్తుతం ఎందుకు ఇంత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది?.. ఎందుకు సక్సెస్ రేట్ ఎందుకు ఇంత తక్కువగా ఉందని మీడియా అక్షయ్‌ని ప్రశ్నించగా.. అక్షయ్ సమాధానమిస్తూ.. ఓటీటీల వలనే సినిమాలు థియేటర్‌లో ఆడకుండా ఫ్లాప్ అవుతున్నాయని వెల్లడించాడు. నేను ఈ మధ్య కొంతమందిని కలిసినప్పుడు వారితో సినిమాల గురించి మాట్లాడాను. అయితే వారు సినిమాలు థియేటర్‌లో కాకుండా ఓటీటీలో చూస్తున్నాం అని చెబుతున్నారు. ఒక సినిమా బాక్సాఫీస్ దగ్గర రన్ అవ్వకుండా ఫ్లాప్ అవ్వడానికి ఇదే ముఖ్య కారణం. కరోనా వేవ్ తర్వాత కూడా ఓటీటీలకు అలవాటైన ప్రేక్షకులు ఇప్పుడు థియేటర్‌కి రావడం క్రమంగా తగ్గించారు. ఈ మధ్య ఈ అలవాటు బాగా పెరిగింది అని తెలిపాడు. ప్రేక్షకులు కూడా ఈ మధ్య సెలక్టివ్‌గా సినిమాలు చూస్తున్నారు. వారికి సినిమా నచ్చితేనే థియేటర్‌కి వెళుతున్నారు. లేకుంటే అదే సినిమాను ఓటీటీలో వచ్చే వరకు వెయిట్ చేసి చూస్తున్నారు అంటూ అక్షయ్ చెప్పుకొచ్చాడు.

# ఆటోడ్రైవర్‌ను కలిసిన సైఫ్



ముంబైలో ఈ నెల 16న బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై తన ఇంట్లో ఓ దుండగడు కత్తితో దాడి చేశాడని తెలిసిందే. తెల్లవారుజామున 2 గంటలకు ఇంట్లో దాడి జరగ్గా.. అతన్ని 3.30 నిమిషాలకు లీలావతి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటన జరిగిన సమయంలో తనను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడిన ఆటోడ్రైవర్ భజన్ సింగ్ రానాను సైఫ్ అలీ ఖాన్ కలిశాడు. దాడి జరిగిన సమయంలో ఆస్పత్రికి తీసుకెళ్లి తనను కాపాడిన భజన్ సింగ్ రానాకు కృతజ్ఞతలు తెలియజేశాడు సైఫ్ అలీఖాన్. భజన్ సింగ్‌తో సైఫ్ అలీఖాన్ దిగిన ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. దాడి జరిగిన సమయంలో సైఫ్ అలీ ఖాన్ రక్తంతో తడిసిపోయాడని, నడవలేని స్థితిలో ఉన్నాడని ఆటో డ్రైవర్ భజన్ సింగ్ ఇప్పటికే మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే.సైఫ్ ఇంట్లోకి చొరబడిన వ్యక్తి తన వద్ద ఉన్న పదునైన ఆయుధంతో హీరోను పొడిచాడు. సుమారు ఆరు చోట్ల బలమైన కత్తిపోట్లు ఉన్నట్లు లీలావతి ఆస్పత్రి డాక్టర్లు చెప్పారు. రెండు చోట్ల మాత్రం ఆ కత్తి పోట్లు చాలా డీప్‌గా ఉన్నాయని.. ఒక కత్తిపోటు సైఫ్ వెన్నుపూస సమీపంలో డీప్‌గా దిగినట్లు చెప్పారు. మెడ, చేయి, వెన్నులో ఓ పదునైన ఆయుధంతో దాడి చేసినట్లు తెలిపారు. వెన్నులో దిగిన వస్తువును సర్జరీ ద్వారా తొలగించినట్లు వెల్లడించారు.

# సినిమా రంగం నాకు ఇష్టం లేదు
## : నిత్యా మేనన్



మలయాళ భామ నిత్యా మేనన్ కు దక్షిణాదిలోనే కాదు... బాలీవుడ్ లో కూడా మంచి గుర్తింపు ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నిత్య మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు సినిమా రంగం అంటేనే ఇష్టం లేదని ఆమె చెప్పారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా జీవితాన్ని అనుభవించాలనేది తన కోరిక అని... ఏదైనా అవకాశం వస్తే మరో రంగంలోకి వెళ్లాలని కూడా ప్రయత్నించానని తెలిపారు. అయితే జాతీయ అవార్డు తన ఆలోచనలను మార్చిందని చెప్పారు. ఉత్తమ నటిగా తాను అందుకున్న పురస్కారం తన సినీ జీవితానికి ఒక మార్గాన్ని చూపించిందని అన్నారు. మరోవైపు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత బయోపిక్ లో నిత్యా మేనన్ నటించాల్సి ఉంది. నిత్య కథానాయికగా జయలలిత బయోపిక్ చేస్తున్నట్టు 2019లో ప్రియదర్శిని అనే యువ దర్శకురాలు ప్రకటించారు. 'ది ఐరన్ లేడీ' అనే టైటిల్ పోస్టర్ ను కూడా విడుదల చేశారు. ఇది జరిగి ఐదేళ్లు దాటుతున్నా సినిమా మాత్రం పట్టాల పైకి ఎక్కలేదు. జయ బయోపిక్ పై నిత్య మాట్లాడుతూ... బయోపిక్ చేయాలని తాము ఎంతో ఆశపడ్డామని చెప్పారు. అయితే తాము సినిమాను ప్రకటించిన తర్వాత అదే కథతో 'తలైవి' అనే మూవీ వచ్చిందని తెలిపారు. కొంత కాలానికి 'క్వీన్' పేరుతో వెబ్ సిరీస్ వచ్చిందని చెప్పారు. ఈ రెండు విడుదలయ్యాక... తాము సినిమా చేస్తే రిపీట్ చేసినట్టు అవుతుందని... అందుకే ఆ సినిమాను పక్కన పెట్టేశామని తెలిపారు.

# వీల్‌చైర్‌పై రష్మిక
## త్వరగా కోలుకోవాలని అభిమానుల పోస్టులు



నేషనల్ క్రష్ రష్మిక మందన్నకి ఇటీవలే ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. రెండు వారాల క్రితం జిమ్‌లో ఎక్సర్‌సైజ్ చేస్తుండగా.. కాలికి గాయం అయింది. అప్పటి నుంచి రష్మిక ఇంట్లోనే ఉంటూ రెస్ట్ తీసుకుంటున్నారు. తాజాగా రష్మిక వీల్‌ఛైర్‌పై దర్శనమిచ్చారు. కాలికి కట్టుతో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన రష్మిక.. కారు దిగగానే వీల్‌ఛైర్‌లో కూర్చుని వెళ్లారు. ఆ సమయంలో ముఖం కనిపించకుండా మాస్క్ పెట్టుకుని, తలకు క్యాప్‌తో దర్శనమిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. వీడియో చూసిన నెటిజన్లు రష్మిక త్వరగా కోలుకోవాలంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# మోనాలిసా. కుంభమేళా టు బాలీవుడ్



ఉత్తర ప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళాలో ప్రతి రోజు ఎన్నో చిత్ర విచిత్రాలు జరుగుతూ ఉంటాయి. అయితే కొన్ని మాత్రమే సోషల్ మీడియాలో వైరల్ అవుతాయి. కుంభమేళా ఆరంభం అయినప్పటి నుంచి ఒక అమ్మాయి గురించి ప్రముఖంగా సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఆ అమ్మాయి పేరు మోనాలిసా. ఇండోర్‌కి చెందిన మోనాలిసా ఫ్యామిలీ కుంభమేళాలో పూసల దండలు, రుద్రాక్ష దండలు అమ్ముకోవడానికి వెళ్లారు. కుంభమేళాలో కొందరు యువకులు ఈమెను చూసి చాలా అందంగా ఉంది అంటూ ఒక వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆమె కళ్లు చాలా స్పెషల్‌గా ఉన్నాయంటూ ఆ వీడియోకు మంచి స్పందన వచ్చింది. కుంభమేళాకు వెళ్లిన వారిలో చాలా మంది ఇప్పుడు మోనాలిసా ఎక్కడ ఉంది అంటూ వెతకడం మొదలు పెట్టారు. ఆమె ఎక్కడ కనిపిస్తే అక్కడ గుంపులుగా ఏర్పడి ఆమెతో సెల్ఫీకి ఎగబడుతున్నారు. ఆమెను కాపాడేందుకు ఒకానొక సమయంలో ఫ్యామిలీ మెంబర్స్‌కి చాలా ఇబ్బందిగా మారింది. సోషల్ మీడియాలో అప్పుడప్పుడు ఇలా వైరల్ కావడం మనం చూస్తూనే ఉంటాం. మోనాలిసా సోషల్ మీడియాలో వైరల్ అయిన వెంటనే ఎవరో ఒకరు కచ్చితంగా పిలిచి సినిమా ఆఫర్లు ఇస్తారని అంతా భావించారు. అనుకున్నట్లుగానే బాలీవుడ్ నుంచి మోనాలిసాకి సినిమా ఆఫర్ వచ్చింది. అయితే సినిమా ఆఫర్ పై మోనాలిసా స్పందన ఏంటి అనేది చూడాలి. ! బాలీవుడ్ దర్శకుడు సనోజ్ మిశ్రా తన సినిమాలో కుంభమేళా మోనాలిసాకి ఛాన్స్ ఇవ్వాలని అనుకుంటున్నట్లు చెప్పుకొచ్చాడు. త్వరలోనే మోనాలిసాను కలుస్తాను అన్నాడు. అయితే ఆయన తీయబోతున్న సినిమా ఏంటి, ఆమెను ఏ పాత్ర కోసం ఎంపిక చేయబోతున్నది క్లారిటీ ఇవ్వలేదు. నటిగా చేసే ఉద్దేశ్యం మోనాలిసాకు ఉందా అంటూ కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాలీవుడ్ వంటి అతి పెద్ద ఇండస్ట్రీలో నటించే అవకాశాల కోసం లక్షల మంది వెయిట్ చేస్తూ ఉంటారు. అలాంటి అవకాశం వస్తే మోనాలిసా వదులుకోదు అని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మోనాలిసా మేకోవర్ మార్చేసింది. ఇటీవల ఒక బ్యూటీషన్ సోషల్ మీడియాలో మోనాలిసా వీడియోను షేర్ చేసింది. ఆ వీడియోలో మోనాలిసాకి మేకోవర్ చేసింది. ఆ వీడియో సైతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మోనాలిసా ఈమధ్య సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది కానీ, ఆమె ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ ఛానల్, ఎక్స్ ఖాతాలు చాలా కాలంగా ఉన్నాయి. ఆమె వీడియోలను షేర్ చేస్తూ ఉండేది. కానీ ఆ వీడియోలు పెద్దగా వైరల్ కాలేదు. కానీ అనూహ్యంగా ఇప్పుడు మోనాలిసాకి మంచి గుర్తింపు దక్కింది. మోనాలిసా కళ్లలో ఉన్న ప్రత్యేకత కారణంగా కచ్చితంగా బాలీవుడ్‌లో మంచి ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. నటిగా తనను తాను నిరూపించుకుంటే కచ్చితంగా సినిమా ఇండస్ట్రీలో ఈమెకు మంచి ఫ్యూచర్ ఉంటుంది. అయితే సినిమాల ఎంపిక విషయంలో కాస్త జాగ్రత్తలు